సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 14 । అక్టోబర్ । 2025


జీఎస్టీ 2.0 ప్రయోజనాలపై బైక్ ర్యాలీ 8లో


ప్రజా పరిపాలనలో నూతన పోకడలపై ఐపీఏ సదస్సు 8లో


సఫారీల జైత్రయాత్ర 8లో

కూటమి అండ కల్తీ దందా

కల్తీ మద్యంపై కదం తొక్కిన వైఎస్సార్ సీపీ మహిళా విభాగం

నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీస్తున్న కూటమి ప్రభుత్వంపై మహిళలు కదం తొక్కారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో రణభేరీ మోగించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సోమవారం జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నల్లబ్యాడ్జీలు ధరించి భారీ ఎత్తున నిరసన ర్యాలీలు నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను ఎక్సైజ్ అధికారులకు అందజేశారు. నకిలీ మద్యం తయారీని ఒక పరిశ్రమలా మార్చి, ప్రజల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ మద్యం గుట్టు పూర్తిగా తేల్చేందుకు సీబీఐ దర్యాప్తు చేయాలని, వైన్‌షాప్‌లు, పర్మిట్‌రూమ్‌లు, బార్లు, బెల్టుషాపుల్లో ఎక్సైజ్ శాఖ విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేశారు.
– సాక్షి, విశాఖపట్నం



పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు

తూర్పు నియోజకవర్గంలో సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కల్యాణి, మహిళా విభాగం నాయకులతో కలిసి ఎక్సైజ్ అధికారికి వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయని, మద్యం మత్తులో హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర మత్స్యకార విభాగం అధ్యక్షుడు పేర్ల విజయచందర్, సీనియర్ నాయకుడు గొలగాని శ్రీనివాస్, కార్పొరేటర్లు మొల్లి లక్ష్మి, పల్లా అప్పలకొండ, కోరుకొండ వెంకట స్వాతి దాసు, జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముప్పల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కల్తీ మద్యంతో రోడ్డున పడ్డ కుటుంబాలు

దక్షిణ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో కల్తీ మద్యంపై వినూత్నంగా నిరసన తెలిపారు. రాష్ట్రంలో కల్తీ మద్యం తాగి ఇప్పటికే ఎంతో మంది చనిపోయారని, ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని వాసుపల్లి ఆందోళన వ్యక్తం చేశారు. ఇది మహిళల పసుపు కుంకుమలకు చెందిన విషయం కాబట్టి వారికి అండగా నిలబడేలా సీబీఐ దర్యాప్తునకు కేంద్రం ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జగదాంబ జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ తహసీల్దార్‌కు పార్టీ నాయకులు జాన్‌వెస్లీ, ననపల రవీంద్రభరత్, కార్పొరేటర్లు తోట పద్మావతి, బిపిన్‌కుమార్ జైన్‌తో పాటు పార్టీ అనుబంధ సంఘాల నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు.



75 వేల బెల్టు షాపులు తొలగించాలి

ఉత్తర నియోజకవర్గంలో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణకుమారితో పాటు పార్టీ శ్రేణులు, ప్రజలతో కలిసి బిర్లా జంక్షన్ నుంచి మాధవధారలోని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కల్తీ మద్యంపై సీబీఐ విచారణ చేపట్టాలని, రాష్ట్రంలోని 75 వేల బెల్టు షాపులను తొలగించాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ మేయర్ కె.సతీష్, జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ సాడి పద్మారెడ్డి, కార్పొరేటర్లు, మహిళా నేతలు పాల్గొన్నారు.



సిట్ కాదు.. సీబీఐ దర్యాప్తు కావాలి

భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భీమిలి చిన్నబజార్ జంక్షన్ నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఎక్సైజ్ సీఐ పిన్నింటి శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందించారు. నకిలీ మద్యం వ్యవహారంపై ప్రభుత్వ పెద్దల చేతుల్లో ఉండే సిట్‌తో కాకుండా సీబీఐ దర్యాప్తు జరపాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి వాసురాజు, డాక్టర్ మజ్జి శారద ప్రియాంక, కార్పొరేటర్ దౌలుపల్లి కొండబాబు, ఆనందపురం జెడ్పీటీసీ కోరాడ వెంకటరావు, భీమిలి వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, రాష్ట్ర వైఎస్సార్ సీపీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు దాట్ల పెదబాబు, పోతిన హనుమంతు, ముఖ్య నాయకులు బెందాళం పద్మావతి, చేకూరి రజనీ, పిళ్లా సుజాత పాల్గొన్నారు.



నకిలీ మద్యం విక్రయాలు అరికట్టాలి

గాజువాకలో సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్‌రెడ్డి ఆధ్వర్యంలో దిబ్బపాలెం పునరావాస కాలనీలోని గాజువాక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. తొలుత 71వ వార్డులోని సుందరయ్య కాలనీలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద పోస్టర్లను ప్రదర్శించారు. నకిలీ మద్యం విక్రయాలను అరికట్టాలని కోరుతూ ఎక్సైజ్ సీఐకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంట్ పరిశీలకుడు కదిరి బాబూరావు, నియోజకవర్గ పరిశీలకుడు తైనాల విజయ్‌కుమార్, కార్పొరేటర్లు మహ్మద్ ఇమ్రాన్, ఉరుకూటి చందు, భూపతిరాజు సుజాత, వార్డు అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.



కల్తీ మద్యం మరణాల పాపం బాబుదే..

పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ ఆధ్వర్యంలో బాజీ జంక్షన్ నుంచి ఎన్‌ఏడీ తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సీహెచ్.వి.రమేష్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మళ్ల మాట్లాడుతూ కల్తీ మద్యం మరణాల పాపం ముఖ్యమంత్రి చంద్రబాబుదే అని అన్నారు. ఈ ర్యాలీలో నియోజకవర్గ పరిశీలకుడు చింతలపూడి వెంకటరామయ్య, జిల్లా అంగన్‌వాడీ అధ్యక్షురాలు శ్రీదేవి వర్మ, పశ్చిమ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పేడాడ జ్యోత్స్న, కార్పొరేటర్లు పి.వి.సురేష్, బల్లా లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కుటీర పరిశ్రమగా మార్చేశారు

పెందుర్తి సమన్వయకర్త అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో నాయుడుతోట సమీపంలోని పెందుర్తి ఎక్సైజ్ స్టేషన్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కల్తీ మద్యం తయారీని టీడీపీ నాయకులు అనధికారిక కుటీర పరిశ్రమగా మార్చుకున్నారని ఆక్షేపించారు. అనంతరం ఎక్సైజ్ ఎస్‌ఐ జి.శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. ఎస్‌ఈసీ సభ్యుడు శరగడం చినఅప్పలనాయుడు, సీనియర్ నేత గండి రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కోడిగుడ్ల దేవిసాంబ, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

రూ.700 కోట్ల టీడీఆర్ కుంభకోణం

- టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే స్కెచ్
- గ్రీవెన్స్‌లో జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఫిర్యాదు


జీవీఎంసీ అదనపు కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న పీతల మూర్తి యాదవ్

డాబాగార్డెన్స్: రహదారి పేరిట రూ.700 కోట్ల టీడీఆర్ కుంభకోణానికి టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే తెరతీశారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తికి ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నాయుడుతోట ప్రాంతం నుంచి ఆంధ్రా సిమెంట్స్‌కు వెళ్లే రహదారిని 2014లో కంపెనీ యాజమాన్యం నిర్మించిందన్నారు. అందులో ఉన్న భూములన్నీ ప్రభుత్వ, సింహాచలం దేవస్థానానికి చెందినవని చెప్పారు. వేపగుంట, వెంకటాపురం, పార్లుపాలెం గ్రామాల పరిధిలో 18,230.6 చ.మీలు సింహాచలం దేవస్థానం భూమి కాగా , మరో 13,487.7 చ.మీలు ప్రభుత్వ కొండపోరంబోకు, గయాలు తదితర భూములుగా 22ఏలో స్పష్టంగా పొందుపరిచారన్నారు. తొలుత ఈ రహదారికి వంద అడుగుల మేర రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్ తయారు చేసి ఏకంగా రూ.700 కోట్ల టీడీఆర్‌ను కొట్టేయడానికి టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే విశ్వ ప్రయత్నాలు చేశారన్నారు. తాను ఇచ్చిన ఫిర్యాదుల మేరకు అప్పట్లో దానిని నిలిపివేశారన్నారు. తాజాగా మరో జనసేన శాసనసభ్యుడు అక్కడ 100 అడుగుల రహదారి అవసరం లేదని కేవలం 40 అడుగుల రహదారి సరిపోతుందని వీఎంఆర్‌డీఏకు లేఖ రాశారన్నారు. దీంతో ఇప్పుడు వంద అడుగుల సంగతి పక్కన పెట్టి 40 అడుగుల రహదారికి టీడీఆర్ పొందేందుకు టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే ప్రయత్నాలను ముమ్మరం చేశారన్నారు. ఇప్పటికే సంబంధిత ఫైలు జీవీఎంసీలో వేగవంతంగా ముందుకు సాగుతుందన్నారు. అసలు ఎప్పుడో ప్రభుత్వ భూముల్లో నిర్మించిన ఆంధ్రా సిమెంట్స్‌కు వెళ్లే రహదారి పేరిట ఇప్పుడు ఎలా టీడీఆర్‌ను జీవీఎంసీ జారీ చేస్తుందని ప్రశ్నించారు. ఇటువంటి టీడీఆర్‌లు జారీ చేయకుండా తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించాలన్నారు. అలా కాకుండా ప్రభుత్వ, సింహాచలం దేవస్థానం భూములకు టీడీఆర్‌లు జారీ చేస్తే తాను న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానన్నారు. పూర్తి వివరాలతో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి కూడా ఫిర్యాదులు చేయనున్నట్లు మూర్తియాదవ్ స్పష్టం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో వచ్చిన ఫిర్యాదులను పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి, పునరావృతం కాకుండా సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవా రం కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి కలెక్టర్ వినతులను స్వీకరించారు. రెవెన్యూ, పోలీస్, జీవీఎంసీ విభాగాలకు సంబంధించి ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రీ-ఓపెన్ అవుతున్న అర్జీలపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై పరిష్కరించిన అర్జీలకు సంబంధించి అర్జీదారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడతానని కలెక్టర్ తెలిపారు. పీజీఆర్ఎస్‌కు మొత్తం 271 వినతులు అందాయి. జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ పాల్గొన్నారు.

ఖాకీ కాంట్రాక్టర్

బల్క్ డ్రగ్ పార్క్ పనుల్లో ఓ పోలీసు అధికారి హస్తం





బల్క్ డ్రగ్ పార్క్ వల్ల తమ జీవితాలు నాశనమవుతాయని ఒకవైపు మత్స్యకారులు తీవ్ర ఆందోళనతో పోరాటాలు చేస్తుంటే.. కనీసం సీరియస్‌గా పట్టించుకోకుండా ఖాకీలు కాసుల వేటలో పడినట్లు తెలుస్తోంది. బినామీ పేర్లతో కాంట్రాక్టర్లుగా మారి వాహనాలు పెట్టి పనిచేయిస్తున్నట్టు సమాచారం. ఓ పోలీసు అధికారి బల్క్ డ్రగ్ పార్క్ పనులకు బినామీ పేర్లతో సుమారు 25 వాహనాలను నడుపుతున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వ్యక్తిగత ప్రయోజనాల కోసమే బల్క్ డ్రగ్ పార్క్ నిరసనల అణచివేతను సదరు అధికారి సీరియస్‌గా తీసుకొని వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- ఏకంగా 25 వాహనాలు... బినామీ పేర్లతో నిర్వహణ
- అందుకే అదే పనిగా ఆందోళనల అడ్డగింత
- కాకినాడ నుంచి అక్రమ మైనింగ్‌కు రూట్ క్లియర్
- గతంలో చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారుల యత్నం
- రంగంలోకి దిగి నిలిపేసిన హోంమంత్రి?

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఆందోళనలను అదుపు చేయడంలో ప్రభుత్వ పెద్దల నుంచి అదేపనిగా వస్తున్న ఒత్తిళ్లతోపాటు ఆ ఖాకీ కాంట్రాక్టర్ వ్యక్తిగత ప్రయోజనాలు కూడా ఇమిడి ఉన్నాయన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. బల్క్ డ్రగ్ పార్కు పనుల్లో కాంట్రాక్టర్ అవతారం ఎత్తడమే కాక.. పక్క జిల్లా కాకినాడ నుంచి మైనింగ్ ట్రక్కులు అక్రమంగా అనకాపల్లి జిల్లాలోకి రయ్ రయ్‌మంటూ రావడానికి కూడా సదరు అధికారి రూట్‌ను పక్కాగా క్లియర్ చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో సదరు పోలీసు అధికారిపై వేటు వేసేందుకు ఉన్నతాధికారులు ప్రయత్నించినట్టు తెలుస్తోంది. అయితే, హోంమంత్రి రంగంలోకి దిగడంతో చర్యలు కాస్తా నిలిపివేసినట్టు ప్రచారం జరుగుతోంది. హోంమంత్రి ఎక్కడకు వెళ్లినా... ఉన్నతాధికారులకు సమాచారం లేకుండా ఆయన కూడా అక్కడకు వెళుతున్నారనే ఆరోపణలున్నాయి.

అక్రమాలకు అండ...!

పాయకరావుపేట నియోజకవర్గం ఎంతో కీలకమైనది. అనకాపల్లి జిల్లాకు శివారు నియోజకవర్గం. ఇక పక్కనే యలమంచిలి నియోజకవర్గంలోని రాంబిల్లి వద్ద నావికాదళ పనులు జరుగుతున్నాయి. ఇక్కడకు ఇప్పటికే అనకాపల్లి జిల్లాలోని రూరల్ మండలాల నుంచి భారీగా అక్ర మంగా బండరాళ్లు వచ్చిపడుతున్నాయి. అంతేకాకుండా జిల్లా పక్కనున్న కాకినాడ జిల్లాలోని రౌతులపూడి నుంచి కూడా అక్రమంగా భారీ సంఖ్యలో రాంబిల్లి వద్దకు టిప్పర్లు చేరుకోవడంలో సదరు పోలీసు అధికారి ప్రమేయం ఉన్నట్టు విమర్శలున్నాయి. కొద్దిరోజుల క్రితం రెండు భారీ బండరాళ్లు నావికాదళ పనుల కోసం తీసుకెళుతుండగా రోడ్డు మీదనే పడిపోయాయి. టిప్పర్ వెనుక ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ టిప్పర్ ఎటువంటి అనుమతులు లేకుండానే నిబంధనలకు మించి అధిక లోడుతో ఏకంగా కాకినాడ జిల్లా నుంచి వచ్చింది. ఈ వాహనం పాయకరావుపేటలోని పోలీసుల అనధికార అనుమతితోనే దర్జాగా జిల్లాలోకి ప్రవేశించిందనే విమర్శలున్నాయి. ఈ వ్యవహారంలో ప్రతి నెలా సదరు అక్రమ మైనింగ్ మాఫియా నుంచి భారీగా దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.


రాంబిల్లి మండలం కొండవారిపాలెం వద్ద టిప్పరు నుంచి జారి పడ్డ భారీ బండరాళ్లు (ఫైల్)

మంత్రి అండదండలతో.....!

సదరు పోలీసు అధికారి హోంమంత్రి సొంత నియోజకవర్గంలో ఆమె అండదండలతోనే పోస్టింగు దక్కించుకున్నారు. దీంతో అటు ఎస్పీని, ఇటు డీఐజీని కూడా లెక్క చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అంతేకాకుండా నియోజకవర్గంలో ఎవరికి పోస్టింగు దక్కాలన్నా... తన అనుమతితోనే జరుగుతుందని కూడా చెప్పుకునేవారు. సదరు పోలీసు అధికారిపై ఇప్పటికే పలు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఒకవైపు బినామీలతో కాంట్రాక్టర్ అవతారం ఎత్తడంతోపాటు అక్రమ మైనింగ్ వాహనాలకు రూట్ క్లియర్ చేయడంలో ఈయనదే కీలకపాత్ర అన్న విమర్శలున్నాయి. ఈ వ్యవహారాలన్నీ కొన్ని నెలల క్రితం జిల్లా పోలీస్ బాస్‌తోపాటు డీఐజీ దృష్టికి కూడా వెళ్లినట్టు తెలుస్తోంది. అప్పట్లోనే చర్యలు తీసుకునేందుకు ఉపక్రమించినప్పటికీ హోంమంత్రి రంగంలోకి దిగి వేటు పడకుండా కాపాడారన్న ప్రచారం ఉంది. దీంతో మరింతగా రెచ్చిపోయి... నియోజకవర్గంలో పోలీసుశాఖ పరంగా ఏది జరగాలన్నా తన అనుమతి ఉండాల్సిందేనంటూ బహిరంగంగా వ్యాఖ్యలు చేసినట్టు సమాచారం. సదరు పోలీసు అధికారికి మరో జూనియర్ పోలీస్ కూడా తోడై.... హోంమంత్రి ఎక్కడకు వెళ్లినా వెళుతున్నట్టు తెలుస్తోంది. హోంమంత్రితోపాటుగా దేవస్థానాల్లో దండలు వేయించుకుని మరీ ఫొటోలకు పోజులు ఇచ్చినట్టు కూడా పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్టు ఆ శాఖలోనే ప్రచారం జరుగుతోంది.

సఫారీల జైత్రయాత్ర



విశాఖ స్పోర్ట్స్ : వైఎస్సార్ స్టేడియంలో సోమవారం జరిగిన ఐసీసీ వుమెన్ క్రికెట్ వరల్డ్‌కప్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా మూడు వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై విజయం సాధించి సెమీస్‌కు అర్హత సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్, షర్మిన్ (50), షోర్నా (51) అర్ధ సెంచరీల సహాయంతో 6 వికెట్లకు 232 పరుగులు చేసింది. 233 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన దక్షిణాఫ్రికా జట్టుకు మారిజన్నే కాప్ (56), క్లో ట్రియాన్ (62) కీలక అర్ధ సెంచరీలతో రాణించడంతో మరో మూడు బంతులుండగానే విజయాన్ని అందుకుంది. ఈ విజయంతో దక్షిణాఫ్రికా వరుసగా మూడు విజయాలు సాధించి, ఆరు పాయింట్లతో సెమీస్ బెర్త్‌ను దాదాపుగా ఖాయం చేసుకుంది.

రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావుకు పరామర్శ



గొల్ల బాబూరావును పరిమర్శిస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

ఆరిలోవ: అనారోగ్య కారణంగా హెల్త్ సిటీ మెడ్ సీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావును మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు సోమవారం సాయంత్రం పరామర్శించారు. ఆయనతో మాట్లాడి ధైర్యం చెప్పారు. వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయనను పరామర్శించిన వారిలో పార్టీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, కార్పొరేటర్ అనిల్‌కుమార్ రాజు, మాజీ కార్పొరేటర్ రవిరాజు, గంగా మహేష్, శివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న ముగ్గురు అరెస్ట్



షేక్ సఫియుర్ రెహ్మాన్ షేక్ అబ్దుల్ రెహ్మాన్ షేక్ హుస్సేన్ వలీ

విశాఖ సిటీ: సైబర్ మోసాల ద్వారా బాధితుల నుంచి దోచుకున్న డబ్బును 'మ్యూల్ అకౌంట్ల' ద్వారా ఉపసంహరించి వాటిని సైబర్ నేరగాళ్లకు క్రిప్టోకరెన్సీగా మార్చి అందించిన ముగ్గురు వ్యక్తులను విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు పంపించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూర్మన్నపాలెం ప్రాంతంలో నివాసముంటున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యోగికి టెలిగ్రామ్ యాప్‌లో 'గోద్రేజ్ ప్రాపర్టీస్' పేరు మీద ఉన్న గ్రూప్‌లో యాడ్ చేసి, ఇంటి వద్దే పార్ట్‌టైమ్ జాబ్ చేసుకోవచ్చని సందేశం వచ్చింది. అది నిజమని నమ్మి, వారు పంపించిన లింకులో అతను తన వివరాలు నమోదు చేసుకున్నాడు. అతనికి '5 స్టార్ రేటింగ్స్' ఇచ్చే పనిని అప్పగించారు. మొదట్లో కొన్ని టాస్కులు పూర్తి చేసిన తరువాత లాభాలు కూడా అందడంతో అతనికి నమ్మకం ఏర్పడింది. తర్వాత ఫైజా అనే వ్యక్తి తాను సీబీఏవో అనే కంపెనీకి సలహాదారునిగా పనిచేస్తున్నానని చెబుతూ.. ఇందులో ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మబలికాడు. ఇలా ఎన్ఈఎఫ్‌టీ, ఐఎంపీఎస్, యూపీఐ మార్గాల ద్వారా డబ్బులు పంపించమని కోరారు. ఆ సూచనల ప్రకారం బాధితుడు మొత్తం రూ.15.51 లక్షలు వివిధ బ్యాంకు లావాదేవీల ద్వారా జమ చేశారు. లాభాలు రాకపోగా.. డబ్బు విడుదల చేయాలంటే మరింత మొత్తం చెల్లించాలంటూ మోసగాళ్లు పదేపదే డిమాండ్ చేయడం ప్రారంభించారు. దీంతో మోసపోయినట్లు గ్రహించి వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రూ.2.5 కోట్లు లావాదేవీలు

నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మొదటిగా బ్యాంక్ లావాదేవీలు, యూపీఐ పేమెంట్ లింకులు, టెలిగ్రామ్ గ్రూప్ ఐపీ లాగ్‌లు, ఫేక్ వెబ్‌సైట్‌లను విశ్లేషించారు. ఈ ప్రక్రియలో అనేక లేయర్‌ల ద్వారా డబ్బు తిరిగి, తిరిగి చివరకు నంద్యాల జిల్లాకు చెందిన షేక్ సఫియుర్ రెహ్మాన్, షేక్ అబ్దుల్ రెహ్మాన్, షేక్ హుస్సేన్ వలీ ఖాతాల్లోకి చేరినట్లు తేలింది. వీరు సుమారు 15 బ్యాంక్ అకౌంట్ల ద్వారా క్యాష్ డిపాజిట్లు, సీఎండీ లావాదేవీలు, యూఎస్‌డీటీ కొనుగోళ్లు, అమ్మకాలు జరిపారు. టెలిగ్రాంలో పరిచయమైన జేఎండీ అకౌంట్‌లో సుమారు రూ.2.5 కోట్లు క్రిప్టోకరెన్సీ లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఇందులో సఫియూర్ రెహ్మాన్‌కు సహకరించిన అబ్దుల్ రెహ్మాన్, షేక్ హుస్సేన్ వలీలను విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. సైబర్ నేరాలకు వినియోగిస్తున్న బ్యాంక్ అకౌంట్స్, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని కోర్టులో ప్రవేశ పెట్టగా, వారికి 15 రోజుల జుడీషియల్ రిమాండ్ విధించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడి కోసం పోలీసులు లోతైన దర్యాప్తు చేస్తున్నారు.

పచ్చ కామెర్ల బాధితుల తరలింపు

మహారాణిపేట : కురుపాం గురుకుల బాలికల పాఠశాలకు చెందిన 21 మంది పచ్చ కామెర్ల బాధితులను సోమవారం కేజీహెచ్ నుంచి పార్వతీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. విద్యార్థులకు వ్యాధి పూర్తిగా తగ్గిపోయిందని, వైద్యులు ఇచ్చిన నివేదికల ఆధారంగానే తరలించినట్టు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. డాక్టర్ గిరినాథ్ (గ్యాస్ట్రో ఎంటాలజీ), డాక్టర్ శివకళ్యాణి (మైక్రోబయాలజీ), డాక్టర్ కృష్ణవేణి (కమ్యూనిటీ మెడిసిన్), డాక్టర్ వాసవి లత (జనరల్ మెడిసిన్), డాక్టర్ చక్రవర్తి (పిల్లల వైద్యుడు) సహా ఐదుగురు వైద్యుల బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా విద్యార్థుల తరలింపు నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇప్పటివరకు పలు విడతల్లో మొత్తం 44 మంది విద్యార్థులను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు సూపరింటెండెంట్ వివరించారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాం గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మొత్తం 50 మంది విద్యార్థినులు పచ్చ కామెర్ల బారిన పడ్డారు. వీరిలో తొమ్మిదో తరగతి చదువుతున్న తోయిక కల్పన, పదో తరగతి చదువుతున్న పువ్వల అంజలి మృత్యువాత పడటం కలకలం సృష్టించింది. ఈ ఘటనపై కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి ఆధ్వర్యంలో గ్యాస్ట్రో ఎంటాలజీ, జనరల్ ఫిజిషియన్, ఇతర వైద్యులు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించారు.

డాక్టర్ ఎస్‌కేఈ అప్పారావుకి 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు'

మహారాణిపేట: విజయవాడలో ఈనెల 10 నుంచి 12 వరకు జరిగిన 20వ సౌత్ జోన్ ఈఎన్‌టీ కాన్ఫరెన్స్‌కు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి 700 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈఎన్‌టీ సంఘానికి సేవలందించిన డాక్టర్ ఎస్‌కేవీ అప్పారావుకు విశాఖలో సీనియర్ ఈఎన్‌టీ సర్జన్, అంకోశ అధ్యక్షులుగా వ్యవహరించినందుకు గాను, 40 ఏళ్ల నుంచి అందించిన వారి సేవలను గుర్తించి 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు' అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అఖిల భారత ఈఎన్‌టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ డి. ముఖర్జీ తదితరులు డాక్టర్ అప్పారావును సన్మానించారు.



డాక్టర్ అప్పారావును సన్మానిస్తున్న ఈఎన్‌టీ వైద్యులు

ప్రజా పరిపాలనలో నూతన పోకడలపై ఐఐపీఏ సదస్సు

మద్దిలపాలెం: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఐఐపీఏ), విశాఖ లోకల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ పబ్లిక్ పాలసీ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్' అనే కీలక అంశంపై సోమవారం పాలిటిక్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం తరగతి గదిలో సదస్సు జరిగింది. విశ్రాంత ఐఏఎస్ అధికారిణి వి. అనురాధ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రభుత్వ విధానాల్లో అనేక ముఖ్యమైన మార్పులు వచ్చాయని, వాటిని సోదాహరణంగా వివరించారు. ముఖ్యంగా పట్టణీకరణ వలన కలిగే లాభాలు, నష్టాల గురించి ప్రస్తావించారు. ప్రధాని నరేంద్ర మోడీ 'మన్ కీ బాత్' కార్యక్రమం ఆయనకు విశేష గుర్తింపు తెచ్చిందని గుర్తు చేస్తూ, గ్రీన్ ఎకానమీ భారత ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఐపీఏ విశాఖ లోకల్ బ్రాంచ్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎన్. సాంబశివరావు, ఐఐపీఏ సెక్రటరీ ప్రొఫెసర్ ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.

టూ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ శిక్షణకు దరఖాస్తులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 'టూ వీలర్ సర్వీస్ టెక్నీషియన్' కోర్సులో మూడు నెలల ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి లేదా ఆపై అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. శిక్షణ తరగతులు ఈనెల 23న ప్రారంభమవుతాయని చెప్పారు. వివరాలకు 99487 68778 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

సీసీఐలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ఎంవీపీకాలనీ: జిల్లాలోని చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్స్ (సీసీఐలకు) రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి రామలక్ష్మి తెలిపారు. జువైనల్ జస్టిస్ చట్టాల ప్రకారం అనాథ, నిరాధార పిల్లలకు ఆశ్రయం, సంరక్షణ కల్పిస్తున్న సంస్థలు కచ్చితంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. లైసెన్స్ లేకుండా ఇలాంటి ఇన్‌స్టిట్యూషన్స్‌ను నిర్వహించడం చట్టవిరుద్ధమన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకొని సంస్థలను అనర్హంగా పరిగణించడంతో పాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి సంస్థలు జిల్లాలో ఉంటే మహిళా, శిశు సంక్షేమ, సాధికారతాధికారి కార్యాలయానికి సమాచారం అందించాలని కోరారు.

జీవీఎంసీ పీజీఆర్ఎస్‌కు వంద ఫిర్యాదులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మొత్తం 100 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. పెదగంట్యాడ వద్ద అదానీ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటును రద్దు చేయాలని, తక్షణమే కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి యుద్ధ ప్రాతిపదికన తీర్మానం పంపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఆధ్వర్యంలో నాయకులు వినతి పత్రం అందజేశారు. కోరారు. ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, ఫైనాన్సర్ అడ్వైజర్ మల్లికాంబ, సీసీపీ ప్రభాకరరావు, డీసీఆర్ శ్రీనివాసరావు, డీడీహెచ్ దామోదరరావు, పర్యవేక్షక ఇంజినీర్లు కె.శ్రీనివాసరావు, సంపత్‌కుమార్, గోవిందరావు, శాంతిరాజు, ఏడుకొండలు, డీసీపీలు హరిదాసు, కె.వేంకటేశ్వరరావు, రామ్మోహన్, యూసీడీ పీఓ ప్రసన్నవాణి, డీపీవో శాంతికుమారి పాల్గొన్నారు.

నేటి నుంచి 'సమాచార హక్కు' వారోత్సవాలు

మహారాణిపేట: సమాచార హక్కు చట్టం ఏర్పాటు చేసి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం నుంచి జిల్లా వ్యాప్తంగా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టంపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై త్వరలో వర్క్‌షాప్ నిర్వహిస్తామన్నారు. ఈ చట్టాన్ని నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు.

సత్తాచాటిన జూనియర్ అథ్లెట్లు వెంకట్రామ్, శేషు



వెంకట్రామ్ శేషు

విశాఖ స్పోర్ట్స్ : 40వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్ర అథ్లెట్లు వెంకట్రామ్, శేషు పతకాలు సాధించారు. భువనేశ్వర్‌లో జరుగుతున్న ఈ మీట్‌లో ఎం. వెంకట్రామ్ అండర్-20 బాలుర 800, 1500 మీటర్ల పరుగుల్లో విజేతగా నిలిచి స్వర్ణాలు అందుకున్నాడు. విశాఖ అథ్లెట్ డి. శేషు అండర్-18 బాలుర విభాగపు 200 మీటర్ల పరుగును 22.09 సెకన్లలో పూర్తి చేసి తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని అందుకున్నాడు. ఆంధ్ర జట్టుకు కోచ్‌గా వైకుంఠరావు వ్యవహరించగా, పతకాలు సాధించిన వీరిద్దరినీ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రతినిధులు అభినందించారు.

జీఎస్టీ 2.0 ప్రయోజనాలపై బైక్ ర్యాలీ

సీతంపేట: విశాఖ కార్మిక శాఖ ఆధ్వర్యంలో సోమవారం 'సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్' ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో భాగంగా, జీఎస్టీ 2.0 సంస్కరణల ప్రయోజనాలు, తగ్గింపు పన్ను రేట్లు, కుటుంబ సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు భారీ ద్విచక్ర వాహన ర్యాలీని చేపట్టారు. సంయుక్త కార్మిక కమిషనర్ ఎం.రామారావు అక్కయ్యపాలెం హైవే వద్ద జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. ఉప కార్మిక కమిషనర్ ఎం.సునీత, డిప్యూటీ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్, జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులు, జీవీఎంసీ, సచివాలయం, యూసీడీ సిబ్బంది ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ముఖ్యంగా, ఈకార్ట్, స్విగ్గీ, రాపిడో, ఫ్లిప్‌కార్ట్, ఊబర్, పోర్టర్ వంటి ప్రముఖ సంస్థల నుంచి వచ్చిన 150 మందికి పైగా గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులు, వీధి వ్యాపారులు, కార్మిక శాఖ సిబ్బంది ఉత్సాహంగా బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ హైవే నుంచి ప్రారంభమై దొండపర్తి, ఆర్టీసీ కాంప్లెక్స్, జగదాంబ జంక్షన్ మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు కొనసాగింది. ర్యాలీలో పాల్గొన్న వారు బ్యానర్లు, ప్లకార్డుల ద్వారా జీఎస్టీ సంస్కరణల సందేశాన్ని ప్రజలకు చేరవేశారు.